సామాజిక మరుగుదొడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు

కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : స్వచ్ఛ భారత్‌మిషన్ ఆధ్వర్యంలో సామాజిక మరుగుదొడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి గ్రామీణ నీటి సరఫరా విభాగం, జిల్లా పంచాయతీ అధికారి, డివిజనల్ పంచాయతీ అధికారులు ఎంపిడిఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన సమూహం అధికంగా ఉన్న ప్రాంతాలు, వారపు సంతలు, పర్యాటక ప్రాంతాలలో నీటి సదుపాయం ఉన్న గ్రామాల్లో సామాజికి మరుగుదొడ్లు నిర్మిస్తామని చెప్పారు. మరుగుదొడ్లు లేని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో మరుగుదొడ్ల నిర్మాణాలకు ప్రతిపాదించాలని చెప్పారు. పారిశుద్ధ్యపు పనులకు మంజూరు చేసిన వాహనాలను వినియోగంలోకి తీసుకుని రావాలన్నారు. సోలిడ్ వేస్ట్ మేనేజ్మెంటు సక్రమంగా జరగాలన్నారు. పారిశుద్ధ్యపు పనులకు జిల్లాకు మంజూరు చేసిన ట్రాక్టర్ల ఎక్కడ, ఎటువంటి స్థితిలో ఉన్నాయో ఆడిట్ చేసి నివేదికలు సమర్పించాలని పేర్కొన్నారు. కోరిన వారందరికి వ్యక్తిగత ఇంకుడు గుంతలు మంజూరు చేస్తామన్నారు. మురుగు కాలవుల కంటే ఇంకుడు గుంతలు నిర్మించడం మంచిదని అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కమ్యూనిటీ ఇంకుడు గుంతలు నిర్మిస్తామని పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్రా కార్పోరేషన్ కార్యనిర్వహాక సంచాలకులు అర్జున రావు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ద్వారా స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్ ఆధ్వర్యంలో వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేస్తామన్నారు. ఇప్పటికే నిర్మించుకుని నివాసం ఉంటున్న గృహాలకు, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద మంజూరు చేసిన గృహాలకు వ్యక్తిగత మరుగుదొడ్ల ను మంజూరు చేస్తామన్నారు. మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.12 వేల నిధులు మంజూరు చేస్తామన్నారు. రూ.3 లక్షల వ్యయంతో సామాజకి మరుగుదొడ్ల నిర్మాణాలు చేపడతామన్నారు. ఎంపిడి ఓలు జిల్లా కలెక్టర్ ద్వార ప్రతిపాదనలు పంపిస్తే దేవాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులు, నాడు నేడులో కవర్ కాని పాఠశాలలు, కెజిబివి పాఠశాలల్లో మరుగుదొడ్లు నిర్మిస్తామన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజనలో నిర్మించిన గృహాలకు 27834 వ్యక్తిగత మరుగుదొడ్ల మంజూరు చేసామన్నారు. జిల్లాలో 22 వేల ఇంకుడు గుంతలు నిర్మాణానికి ప్రతిపాదించామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యక్తిగత ఇంకుడు గుంతలు నిర్మించమని ఆదేశించిందని చెప్పారు. ఈసమావేశంలో పాడేరు ఐటిడిఏ పిఓ వి.అభిషేక్, చింతూరు పి.ఓ అపూర్వ భరత్, రంపచోడవరం పిఓ. కె.సింహచలం ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ పరిహారం త్వరలో జమ చేస్తాం : సబ్ కలెక్టర్ కల్పశ్రీ

విశాలాంధ్ర-దేవీపట్నం : దేవీపట్నం మండలంలో పోలవరం ముంపుకు గురైన నిర్వాసిత కుటుంబాలు పరిహారం అందించామని ఇంకా పెండింగ్‌లో ఉన్న నిర్వాసితులెవ్వరో ముందుకు వస్తే అందరికి పరిహారం అందేలా చూస్తామని సబ్ కలెక్టర్ కల్ప శ్రీ అన్నారు. గురువారం దేవీపట్నం మండల తహసీల్దార్ కార్యాలయం లో నిర్వాసితులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఐటిడిఏ పి ఓ కట్టా సింహచలం తో కలిసి ఆమె నిర్వాసితులను ఉద్దేశించి మాట్లాడారు.తొలుత గోకవరం కాలనీ లో కాకుండా మిగిలిన కాలనీ లో కాంట్రాక్టర్ వల్ల ఏమైనా ఇబ్బందులు అసంపూర్తిగా మిగిలిన పనులేమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులు సూచించారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ దేవీపట్నం పూడిపల్లి తొయ్యేరు కొండమొదలు మడిపల్లి గ్రామాలకు చెందిన సుమారు 409కుటుంబాలలో కొండమొదలు మంటూరులలో 11పిడిఎస్ కుటుంబాలకు పరిహారం అకౌంట్ లలో జమ చేయటం జరిగిందని ఇంకా కొంతమంది మూలపాడు మంటూరు దండంగి గ్రామాలకు చెందిన పెండింగ్ లిస్ట్ ఉందని ఎవరెవ్వరికి ప్యాకేజీ రాలేదో చెప్పాలని అక్కడకి వచ్చిన నిర్వాసితులను అడిగి తెలుసుకున్నారు. అందరికి న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమం లో రెవిన్యూ అధికారులతో పాటు ఎంపిడిఓ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

చెత్త బుట్టలను వినియోగించి అపారిశుద్ధ్య నివారణకు సహకరించండి

విశాలాంధ్ర-చింతపల్లి : చెత్తబుట్టలను సద్వినియోగం చేసుకొని అపారిశుద్ధ్య నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ దురియా పుష్పలత అన్నారు. సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల కేంద్రంలోని ప్రధాన రహదారి, పురవీధులలో చెత్త బుట్టలు ఏర్పాటు చేసే కార్యక్రమం నిర్వహించారు. స్థానిక హనుమాన్ కూడలి నుండి మార్కెట్ వరకు 8 చెత్త బుట్టలు ఏర్పాటు చేయగా, పుర వీధుల్లో 12 చెత్త బుట్టలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అపారిశుద్ధ్య రహితంగా ఉంచేందుకు చెత్తబుట్టలను వినియోగించాలని సూచించారు. ఎంపీడీవో యు ఎస్ వి శ్రీనివాసరావు మాట్లాడుతూ పారిశుద్ధ్య మెరుగుకు చెత్తబుట్టలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అపారిశుద్ధ్యం పెరిగే పరిస్థితులు ఉన్నందున ప్రతి ఒక్కరూ చెత్తబుట్టలను వినియోగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, తోడు సేవా స్వచ్ఛంద సంస్థ కార్యవర్గ సభ్యుడు ముత్తా శ్రీనివాసరావు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులలోని సమస్యలు సత్వరమే పరిష్కారం

విశాలాంధ్ర-దుంబ్రిగూడ: రెవెన్యూ సదస్సులోని భూసమస్యలు సత్వరమే పరిష్కరించేందుకు గ్రామ సభలను ప్రభుత్వం అమలు చేస్తోందని స్థానిక ఇన్చార్జి తహసీల్దార్ ముజీబ్ చెప్పారు. మండల కేంద్రం దుంబ్రిగుడలోని కిడారి సామాజిక భవనంలో రెవెన్యూ సదస్సులను గురువారం నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షుడు టీ.సుబ్బారావు పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సదస్సులను నిర్వహిస్తోందన్నారు. గత ప్రభుత్వ వైఫల్యంతో రీసర్వేతో గిరిజనులు ఇబ్బందులు పడ్డారని చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న సదస్సులను సద్వినియోగం చేసుకుని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచి వెంకట రావు, ఎంపీటీసీ సభ్యురాలు గీత, టీఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, పంచాయతీ కార్యదర్శి విజయ్కుమార్, విఆర్వో సత్యనారాయణ వీఆర్ఏ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

విశాలాంధ్ర -ఎటపాక : ఎటపాక మండలంలోని గన్నవరంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపనకు సర్పంచ్ గడ్డం భద్రమ్మ, ఉప సర్పంచ్ కందుకూరి స్వర్ణ, ఎంపీటీసీ కంటె రాజు, కొబ్బరీ కాయ కొట్టి శంకుస్థాపన చేశారు. గ్రామ పరిదిలోని స్థానిక రైటర్ రామారావు, మూలిశెట్టి వారి వీధి, వసంతాల వారి వీదికి ఎంపిపి నిధులు ద్వారా రోడ్డు మంజూరు చేయడంతో రోడ్డు మంజూరు చేసినందుకు గ్రామ పంచాయితీ వారికి కాలని వసూలు హర్షం వ్యక్తం చేశారు.

ఈసంధర్భంగా ఉప సర్పంచ్ మాట్లాడుతూ పంచాయితీ పరిధిలోని మిగతా అన్నీ కాలనీ వాసులకు రోడ్లు, డ్రైనేజీ కోసం ప్రణాళికలు పంపామని మంజురు కాగానే త్వరలోనే పనులు ప్రారంబిస్తామన్నారు.

గ్రామ పంచాయతి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచయితీ సెక్రటరీ వేంకటేశ్వర్లు, ఏఈ ఎర్రయ్య, సచివాలయం సిబ్బంది, స్థానిక నాయకులు వల్లభనేని సత్యనారయణ పాల్గొన్నారు.

శ్రీమోదమాంబ జూనియర్ కళాశాల ముసుగులో నర్సింగ్ కళాశాల నిర్వహణ

- ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహణ
- రేకుల షెడ్‌లో తరగతులు
- ఇన్స్‌పెక్షన్ చేసే సమయానికి అధికారులను వేరేచోట చూపించిన వైనం

విశాలాంధ్ర-పాడేరు : పాడేరు జిల్లా కేంద్రంలో ప్రైవేటు కళాశాలాల నిర్వహణ ఒక చీకటి మయంగా తయారైంది. అనుమతులు లేని కళాశాలలను ఉన్నట్లు రికార్డులు సృష్టించి విద్యను చీకటి వ్యాపారంగా కొంతమంది ప్రభుదులు చేస్తున్నారంటే నమ్మకం వెయ్యడం లేదా..? ఇది పక్కా వాస్తవం... ఒక్కసారి ఆ కళాశాల కోసం జిల్లా వసతులకు పరిచయం చేసే ప్రయత్నమే ఈ వార్త సారాంశం. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. పాడేరు జిల్లా కేంద్రంలో శ్రీ మోదమాంబ జూనియర్ ప్రైవేటు కళాశాల పి ఎం ఆర్ సి రోడ్ లో ఒక రేకుల షెడ్ లో కనీస సౌకర్యాలకు నోచుకోకుండా పాడుబడ్డ షెడ్ లో ప్రస్తుతం బోర్డు పెట్టీ నిర్వాహకులు నిర్వహిస్తున్నారు.ఒక్క మాటలో ఇది దుంప్పల బడికి సరితుగదు అటువంటి షెడ్ లో కళాశాల నిర్వహణ అంటే నమ్మ శక్యం గా లేదు. అంతే కాదు ఈ కళాశాల ముసుగులో గుట్టుచప్పుడు కాకుండా నర్సింగ్ హెూమ్ కళాశాల నిర్వహణ చేస్తున్నారంటే నమ్మకం వెయ్యడం లేదా...? ఇది పక్క వాస్తవం..! ఈ కళాశాలకు కనీసం సరైనా అనుమతులు కూడా లేదని పుకార్లు షికార్లు కొడుతుంది. పబ్లిక్ చేస్తున్న ఆరోపణలకు నిజమనే సంకేతాలు కూడా లేక పోలేదు.. ఎందుకంటే బోర్డు వేరే కళాశాల... నర్సింగ్ హెూమ్ కళాశాల బోర్డు లేనే లేదు. నర్సింగ్ హెూమ్ కళాశాల పేరిట సిల్వర్ నగర్ లో ఒక ఇల్లు అద్దెకు తీసుకునీ అక్కడ నుండి కార్యకలాపాలు చేస్తూ ప్రస్తుతం కొనసాగిస్తున్నారు. తల తోక ఏది లేదు. పట్టణానికి దూరంగా ఓ ఇంటి అద్దెకు తీసుకుని అది కూడా చాలి చాలని ఇరుకు గదిలో విద్యార్థినులకు ఉంచిన పరిస్థితి ప్రస్తుతం ఉంది. మొదటి సంవత్సరం విద్యార్థినులకు ఒకరు బాధ్యత తీసుకొగా, ద్వితీయ, పైనల్ విద్యార్థులకు మరొకరు బాధ్యత తీసుకొని నిర్వహించడం విశేషం. కళాశాలలో సరైన మరుగుదొడ్ల లేక ఆడపిల్లలు నానా అవస్థలు పడుతున్నారు.నర్సింగ్ హెూమ్ కళాశాలలో ఉండాల్సిన ల్యాబ్ అక్యూట్స్ మెంట్, బాలికలకు మరుగుదొడ్ల సౌకర్యం లేదు, ఉన్న బాత్రూమ్కి తలుపుకూడా లేదు. బాలికలు మలవిసర్జనకు వెళ్ళాలంటే చాలా ఇబ్బందిపడుతూ వెళ్తున్నట్లు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని సమస్యల నడుమ కళాశాల నిర్వహిస్తున్నారంటే నమ్మలేకపోతున్నారా...?

ఇది నిజమండోయ్... మరో విశేషమేమిటంటే ఈ కళాశాలలో చూపించాల్సిన రికార్డ్స్ అన్ని మరో పాఠశాలలో చూపిస్తూ (మోదమంబ పాఠశాల సమీపంలో ఉన్న కాలి భావనలు చూపించి) మూడు పువ్వుల ఆరు కాయలు అన్న చందంగా చక్కగా కళాశాల నిర్వహించుతున్నారో ఆశ్చర్య పోవాల్సిందే..? కళాశాలలో ఉపాధ్యాయులు కూడా ఉన్నతమైన చదువులు చదివిన వారు కారనే ఆరోపణలు లేకపోలేదు. విద్యార్థినుల చేత వేలకు వేల రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపణలు కూడా లేకపోలేదు. పాడేరు పట్టణంలో నిర్వహిస్తున్న ఇటువంటి కళాశాలలపై విద్యాశాఖ అధికారులతో పాటు కలెక్టర్ చొరవ తీసుకొని ఇటువంటి కళాశాలలను నిర్వహిస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకోని విద్యార్థినిలకు తగు న్యాయం చేయాలని పలు సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.

జె.కె.సి.టి. ట్రస్ట్ ద్వారా బాధిత కుటుంబానికి 5000/- రూపాయలు వితరణ

విశాలాంధ్ర-మోతుగూడెం : చింతూరు మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన సున్నం యర్రయ్య అనారోగ్య కారణంగా ఇటీవల మృతి చెందాడు. కుటుంబ ఆర్థిక సమస్యల కారణంగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో స్థానికుల సలహా మేరకు గురువారం మృతుడి కుటుంబ సభ్యులకు జే.కె.సి, ట్రస్ట్ చైర్మన్ ఆయుర్వేద వైద్యులు మహమ్మద్ జమాల్ ఖాన్, 5000/- రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు షేక్ రసూల్, చందు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

417 కిలోల గంజాయితో ఒకరు అరెస్టు

విశాలాంధ్ర-కొయ్యూరు : మండలంలోని చీడిపాలెం జంక్షన్ వద్ద అక్రమంగా వ్యాన్‌తో తరలిస్తున్న 417 కిలోల గంజాయితో ఒకరిని అరెస్టు చేసినట్టు కొయ్యూరు ఎస్ఐ కిషోర్ వర్మ తెలిపారు. వాహనాల తనిఖీల్లో భాగంగా చీడిపాలెం వద్ద తనిఖీ చేస్తుండగా ఒరిస్సా నుండీ బొలెర వ్యాన్‌తో ఒక వ్యక్తి 417 కిలోల గంజాయిని మూటలు కట్టి తరలిస్తూ పట్టుబడినట్టు ఎస్ఐ తెలిపారు. వీటి విలువ సుమారు 20.85 లక్షల రూపాయిలు ఉంటుందని తెలిపారు. గంజాయితో వ్యాన్ స్వాధీనం చేసుకుని ముద్దయిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ కిషోర్‌వర్మ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. పలువురు పోలీసులు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

పత్రికా విలేఖర్లు కావలెను

విశాలాంధ్ర తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఈక్రింది మండలాలు మారేడుమిల్లి, రంపచోడవరం, ప్రాంతాలకు అనుభవం గల విలేకరులు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెం. 7989138129, 7386603589

గర్భిణీలలో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా పర్యవేక్షణ ఉండాలి

విశాలాంధ్ర-బెలగాం/కొమరాడ : గర్భిణీలలో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు కె.ఆర్.బి పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన పిఎంఎస్ఎంఎ (ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్) కార్యక్రమాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా అప్పుడే వైద్య పరీక్షలు పూర్తి చేసుకొని ఫీడర్ అంబులెన్స్ వాహనంలో ఇంటికి బయల్దేరుతున్న గర్భిణీ తో మాట్లాడి ఆరోగ్యస్థితి తెలుసుకున్నారు. మారుమూల మసిమండ గ్రామానికి చేర్చుతున్నామని వాహన సిబ్బంది తెలిపారు. అనంతరం పిహెచ్సీలో గర్భిణీలకు వైద్యాధికారి, వైద్య సిబ్బంది చేపడుతున్న ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షల వివరాలు మాతాశిశు సంరక్షణ కార్డులలో పరిశీలించారు. గత నెల నివేదికలు, ఆరోగ్యస్థితి వివరాలతో సరి చూశారు. ల్యాబ్ వద్ద పరీక్షలు చేస్తున్న తీరును గమనించారు. రక్తహీనత గుర్తించిన గర్భిణిల్లో నెలనెలా హిమోగ్లోబిన్ శాతం వృద్ధి చెందేలా చర్యలు చేపట్టాలని, ఎనీమియా ఏక్షన్ కమిటీలు పక్కగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రసవ సమయం నాటికి రక్తహీనత ఉండరాదని, అంగన్వాడీ, వైద్య సిబ్బంది సమన్వయంతో పని చేసి గర్భిణిలు పోషకాహారం, ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలు సక్రమంగా తీసుకుంటున్నారా లేదా అని క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాలన్నారు. గర్భిణిల్లో జ్వర లక్షణాలను గుర్తిస్తే హైరిస్క్ గా పరిగణించి తక్షణమే పరీక్షలు జరపాలన్నారు. డాక్టర్ జగన్మోహన్ మాట్లాడుతూ గర్భిణీ ఆరోగ్య తనిఖీలు, పరీక్షలు కోసం ప్రతీ నెలా ప్రత్యేకంగా నిర్వహిస్తున్న పిఎంఎస్ఎంఎ కార్యక్రమాన్ని ముందస్తు ప్రణాళికతో చేపట్టాలని ముఖ్యంగా మారుమూల గిరిజన ప్రాంతాల గర్భిణిల ఆరోగ్య విషయమై మరింత శ్రద్ధ కనబర్చాలని సూచించారు. పిహెచ్సీలో ప్రసవాలపై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా పిఎంఎస్ఎంఎలో గర్భిణీలకు అక్కడ పోషకాహారం అందజేసిన సత్యసాయి ట్రస్టు సేవను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ టి. గణేష్ పట్నాయక్, ఆరోగ్య శాఖ డెమో యోగీశ్వరరెడ్డి, ఎస్.యు.ఓ ధనుంజయరావు, సూపర్వైజర్స్ శోభ, శారద, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

బిసి, అగ్రవర్ణాల పేదల కొరకు స్వయం ఉపాధి పథకాలు : కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

విశాలాంధ్ర-పార్వతీపురం/బెలగాం : జిల్లాలోని దారిద్ర్య రేఖకు దిగువనున్న వెనుకబడిన తరగతులు, అగ్రవర్ణాల్లోని పేదల అభివృద్ధి కొరకు స్వయం ఉపాధి పథకం కింద యూనిట్ల స్థాపన, జెనరిక్ ఫార్మసీల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2024-25 ఆర్థిక సం.రంలో 21 నుంచి 60 ఏళ్ల వయసు ఉండి, దారిద్ర్య రేఖకు (బిపిఎల్) దిగువనున్న వెనుకబడిన తరగతులు, అగ్రవర్ణాల్లోని పేదలు (ఈడబ్ల్యూఎస్-కమ్మ, రెడ్డి, ఈ.బి.సి., క్షత్రియ, ఆర్య వైశ్య, బ్రాహ్మణ) అభివృద్ధి కొరకు స్వయం ఉపాధి పథకాలు ఏర్పాటుకు, డి-ఫార్మసీ, బి-ఫార్మసీ పూర్తి చేసిన నిరుద్యోగ యువత జెనరిక్ ఫార్మసీల ఏర్పాటుకు సబ్సిడీతో కూడిన బ్యాంకు రుణాలను అర్హత మేరకు కేటాయించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వెనుకబడిన తరగతుల స్వయం ఉపాధి పథకంలో భాగంగా స్లాబ్-1, 2, 3 కింద 1221 యూనిట్ల స్థాపనకు లక్ష్యాలు నిర్దేశించినట్లు చెప్పారు. ఇందులో యూనిట్ విలువ రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలు ఉండగా, 50 శాతం సబ్సిడీ, 50 శాతం బ్యాంక్ రుణం ఉంటుందని, గరిష్టంగా రూ.75 వేల నుంచి రూ.2లక్షలు సబ్సిడీ లభిస్తుందన్నారు. అదేవిధంగా వెనుకబడిన తరగతుల జెనిరిక్ ఫార్మసీల ఏర్పాటు కొరకు యూనిట్ విలువ రూ.8 లక్షలు చొప్పున 25 యూనిట్ల ఏర్పాటుకు లక్ష్యం కాగా, అందులో ఒక్కో యూనిట్ ధరలో రూ.4 లక్షలు సబ్సిడీ, రూ.4 లక్షలు బ్యాంకు రుణం ఉంటుందని తెలిపారు. అగ్రవర్ణాల్లోని పేదల స్వయం ఉపాధి పథకాల్లో భాగంగా ఈబిసి 6 యూనిట్లు, బ్రాహ్మణులకు 5 యూనిట్లు, క్షత్రియ ఒక యూనిట్ వెరసి 12 యూనిట్లను స్థాపించుటకు చర్యలు చేపట్టడమైందన్నారు. అదేవిధంగా జెనిరిక్ ఫార్మసీలో ఈబిసి, బ్రాహ్మణులు ఒక్కో యూనిట్ చొప్పున రెండు యూనిట్ల ఏర్పాటుకు మొత్తం రూ.16 లక్షలు కేటాయించడం జరిగిందని వివరించారు. అర్హులైన అభ్యర్థులు స్థానిక సచివాలయాల్లో లేదా ఇంటర్నెట్ సెంటరు నందు అభ్యర్థి రేషన్ కార్డు లేదా రైస్ కార్డు,ఆధార్ కార్డు, కుల ధృవీకరణ, ఆదాయ ధృవీకరణ పత్రాలతో ఈనెల 16 లోగా ఆన్ లైన్ లో నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మున్సిపల్ కమీషనర్‌ను పని దినాలలో సంప్రదించవలసినదిగా కలెక్టర్ ఆ ప్రకటనలో వివరించారు.

వారపు సంతలో మొరాయించిన బీరుపాడు ఆర్టీసీ బస్సు

విశాలాంధ్ర-కురుపాం : గురువారం కురుపాం వారపు సంతతో రద్దీగా ఉన్న రావాడ జంక్షన్ లో బీరుపాడు ఆర్టీసీ బస్సు మొరాయించటం వల్ల తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు పడాల్సి వచ్చింది. సంక్రాంతి ముందు వారపు సంత కావడంతో కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాల్లో నుంచి వేలాది మంది బట్టలు, నిత్యవసర సరుకులు కొనేందుకు ఆటోలు, జీపులు, బొలేరోలతో కురుపాం చేరుకున్నారు. అలాగే గురువారం నుంచి పాఠశాలలు, కళాశాలలకు సంక్రాంతి శెలవులు ఇవ్వడంతో వందలమంది విద్యార్థులు ఇళ్లకు వెళ్ళేందుకు కురుపాం చేరుకోవడంతో వారపుసంతలో సంక్రాంతి శోభ సంతరించుకుంది. గత్యంతరం లేని పరిస్థితిలో సంతకు వచ్చిన ప్రజలు తోసి ప్రక్కకు నెట్టడంతో ట్రాఫిక్ అంతరాయం నివారించేందుకు అవకాశం లభించింది.

నేటి నుంచి ఉత్తరద్వార దర్శనం

విశాలాంధ్ర -పార్వతీపురం టౌన్: వైకుంఠ ఏకాదశి మహాపర్వదిన సందర్భంగా శ్రీవిద్య సర్వమంగళ దేవిపీఠం స్థానిక దుర్గ గుడి ప్రాంగణంలో కొలువై ఉన్న శ్రీ వైభవవేంకటేశ్వర స్వామి వారి ఉత్తర ద్వారదర్శన ఉత్సవం శుక్రవారం నుండి13వ తేదిసోమవారం వరకు స్వామివారిఉత్తర ద్వార దర్శనంఏర్పాట్లు చేయడం జరుగుతుందనీ శ్రీ విద్యా సర్వమంగళ దేవి పీఠం వ్యవస్థాపకులు మురుపాక కాళిదాసు యాజీ తెలిపారు.కావున భక్తులు ఈ సదవకాశం వినియోగించుకొని స్వామి అనుగ్రహంనకు పాత్రులు కాగలరనీ కోరారు.

ఎన్.సి.సి ఉపాధ్యాయుడు సస్పెండ్

విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర-బెలగాం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న జి నరసింహదేవ్ ను జిల్లా విద్యాశాఖ అధికారి తిరుపతినాయుడు సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది ఆగస్టు నెల 12న విశాలాంధ్ర దినపత్రికలో వచ్చిన "ఎన్.సి.సి డబ్బులు కాజేసిన ఉపాధ్యాయుని" వార్తకు స్పందించి పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖ అధికారులు, ఎన్.సి.సి అధికారులు దర్యాప్తు జరిపారు. 2024 సం.లో బ్రాంచి హైస్కూలులో 100మంది ఎన్.సి.సి విద్యార్థులకు వచ్చిన యూనిఫామ్ డబ్బులు వసూలు చేసిన వార్తకు స్పందించి దర్యాప్తు నిర్వహించి పార్వతీపురం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎన్.సి.సి ఉపాధ్యాయుడు (ఎఎస్ఓ) జి. నరసింహదేవ్‌ను సస్పెండ్ చేస్తూ ఈమేరకు పార్వతీపురం మన్యం జిల్లా డిఈవో తిరుపతి నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు.

ములక్కాయవలస ఆదర్శ పాఠశాలలో సామాజిక తనిఖీ బృందం

విశాలాంధ్ర-మక్కువ : మన్యం జిల్లా మండలంలో ములక్కాయవలస ఆదర్శ పాఠశాలలో సామాజిక తనిఖీ బృందం ఇందులో భాగంగా పాఠశాలలో ఉన్న అన్ని రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులతో ముఖాముఖితో చర్చించి విద్యార్థులు సమస్యలను తెలుసుకున్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బోజనాలలో నాణ్యతను తనిఖీ చేశారు. పాఠశాలలో ఉన్నటువంటి అన్ని లాబ్‌లు కుడా తనిఖీ చేశారు. పాఠశాల వసతి గృహంను తనిఖీ చేసి విద్యార్థులు సమస్యలు ను తెలుసుకున్నారు. చివరిగా పర్యవేక్షణా అధికారులు సీఆర్‌పీ బి.దాస్, డీఆర్‌పీ శ్రీను వరహమూర్తి విద్యార్థుల తల్లిదండ్రులతో, ఎస్ఎంసి చైర్మన్ భారతి, వైస్‌చైర్మన్ శంకరరావు సభ్యులతో సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.స్వర్ణలత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాళ్లడుమ్మ డిజిటల్ అసిస్టెంట్ రూటే వేరు...

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండలంలో గల తాళ్లడుమ్మ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న యేగిరెడ్డి శంకరరావు చేస్తున్న తీరు విమర్శలకు దారితీస్తుంది. ఈయనకు చినమేరంగి సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ ఇన్చార్జి బాధ్యతలు అప్పగించారు కూడా. గత మూడు రోజులుగా తాళ్లడమ్మ సచివాలయంలో కంప్యూటర్ పాడైపోయిన విధులకు వెళ్ళామా? వచ్చామా? అనే చందంగా విధులను నిర్వహిస్తున్నారు. గురువారం కుల, ఆదాయ సర్టిఫికెట్ ఆర్జీలు ఆన్లైన్ చేయమని ఇద్దరు వ్యక్తులు వెళ్లి కావలసింది ధ్రువపత్రాలు ఇచ్చి అప్లై చేయమని కోరితే కంప్యూటర్ పాడైపోయిందని కంప్యూటర్ మరమ్మత్తులు చేసి ఆన్లైన్ చేస్తానని పంపించేసినట్లు బాధితులు చెబుతున్నారు. వాస్తవానికి తాను ఇన్చార్జిగా వ్యవహరిస్తున్న చినమేరంగి సచివాలయంలో ఆన్లైన్ చేసే అవకాశం ఉన్నా చేయకపోవడం గమనార్హం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వచ్చిన ఆర్జీలను వెంటనే ఆన్లైన్ చేసి పంపడం డిజిటల్ అసిస్టెంట్ బాధ్యత కానీ అలా చేయకుండా మూడు రోజులుగా పనిచేయని సిస్టం ముందు కూర్చుని కాలం గడిపేస్తుండడం ఎంతవరకు సమంజసమో ఉన్నతాధికారులకే తెలియాలి. దీనిపై ఎంపిడిఓ శంబంగి రమేష్ ను వివరణ కోరగా ప్రజల నుండి వచ్చిన ఆర్జీలు వెంటనే ఆన్లైన్ చేసి పంపడం డిజిటల్ అసిస్టెంట్ బాధ్యత అలా చేయకపోవడం తప్పు. దీనిపై తగు చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

ప్రభుత్వ బాలల సంరక్షణ కేంద్రాలను జిల్లా పర్యవేక్షణ కమిటీ సందర్శన

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : జిల్లా బాలల సంరక్షణ పర్యవేక్షణ కమిటీ పార్వతీపురం ఐసిడిఎస్ ప్రాజెక్టులో గల ప్రభుత్వ బాల సంరక్షణ కేంద్రాలను గురువారం సందర్శించడం జరిగింది. బాలసదనం శిశు గృహలను జిల్లా బాల సంరక్షణ అధికారి పర్యవేక్షణ కమిటీ సందర్శించి పర్యవేక్షణ చేయడం జరిగింది. ఈ పర్యవేక్షణలో భాగంగా ప్రస్తుతం ఆయా బాలల సంరక్షణ కేంద్రాలు పనితీరు, రికార్డుల నిర్వహణ అంశాల గురించి నిశితంగా పరిశీలించడం జరిగింది. జిల్లా ప్రొహిబిషన్ ఆఫీసర్ బి.వి రవికుమార్, బాలల సంరక్షణ నడుపుతున్న ఇన్చార్జులకు కొన్ని సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ భాగంలో బాలలు న్యాయ చట్టం 2015 ప్రకారం రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న కారణంగా నిబంధనలు కనుగుణంగా ఇక్కడ ఏర్పాట్లు ఉన్నాయో లేదో పరిశీలించడం కోసం రావడం జరిగింది. అలాగే బాలల సంరక్షణ కేంద్రాలలో ప్రతి గదులను పరిశుభ్రంగా ఉంచుతున్నారో లేదో చూడడం జరిగింది. అదేవిధంగా ఈసంరక్షణ కేంద్రంలో మెడికల్ ఫస్ట్ ఎయిడ్ కిట్ ను, మరియు సిసి కెమెరాలను ఏర్పాటు చేయమని చెప్పారు. ఇందులో పని చేసే సిబ్బందికి పిల్లల పట్ల బాధ్యతగా ఉండాలని తెలియజేయడం జరిగింది. ఈ కమిటీ డిస్టిక్ ప్రొహిబిషన్ ఆఫీసర్ బి.వి రవికుమార్, బి. శ్రీనివాసరావు, చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్, ఎ.సత్యనారాయణ, జిల్లా బాలల సంరక్షణ అధికారి, ఎన్. ప్రసాదరావు - ప్రొటెక్షన్ ఆఫీసర్, పి. శ్రీధర్ -లీగల్ కం ప్రొహిబిషన్ ఆఫీసర్ ఈ పర్యవేక్షణ కమిటీలో పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి పదవికి అమిత్‌షా రాజీనామా చేయాలి

అంబేద్కర్ విగ్రహానికి వినతి

విశాలాంధ్ర-సాలూరు : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ని స్మరించరాదంటూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు ఆయన క్షమాపణ చెప్పాలని నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయ కర్త గేదెల రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని దత్తివలస గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు ఒంటి బుచ్చయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా నియోజకవర్గ ఇంచార్జ్ గేదెల రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సమావేశంలో తీర్మానం చేశారు.మంత్రి పదవికి రాజీనామా చేసేంతవరకు దశలవారీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని పిసిసి పిలుపు నిచ్చిందని అందులో భాగంగా గురువారం దత్తివలసలో కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.శుక్రవారం పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆధ్వర్యాన విశాఖపట్నంలో నిర్వహించనున్న ధర్నాకి కార్యకర్తలు నాయకులు హాజరుకావాలని కోరారు. అనంతరం పిఎస్ బొడ్డవలస గ్రామంలో వున్న అంబేద్కర్ విగ్రహం పాదాల చెంత తీర్మానం కాపీని పెట్టి నిరసన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ద్వారపురెడ్డి పుండరీకాక్షనాయుడు, పట్టణ అధ్యక్షుడు సిగడాపు బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

కంగారుమాడిలో వైద్య శిబిరం

విశాలాంధ్ర-డుంబ్రిగూడ : మండలంలోని కించుమండ పంచాయతీ పరిధిలోనున్న కంగారుమామిడి గ్రామంలో గురువారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక వైద్యాధికారి పి.రాంబాబు, సిబ్బంది వైద్య పరీక్షలను నిర్వహించారు. సాదారణ వ్యాధులపై పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. గ్రామ స్థాయిలో ఉన్నత వైద్యాన్ని గిరిజనులు పొందాలన్నదే లక్ష్యంగా ప్రభుత్వం వైద్య శిబిరాలను నిర్వహిస్తోందన్నారు. ఆసుపత్రిలో సుఖ ప్రసవాలు జరుగుతున్నాయని, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం సమన్వయంతో ఆసుపత్రికి ఆశ్రయించాలని సూచించారు. వ్యాధుల పట్ల అప్రమతంగా ఉండాలని గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్వీ పద్మ, హెల్త్ అసిస్టెంట్ ఎం.సంజీవ్, ఎంఎల్హెచ్పి గణ, ఏఎన్ఎంలు లక్ష్మి, సునీల, మహేశ్వరి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నడుకూరులో ఘనంగా గొర్లె శ్రీరాములు నాయుడు 20వ వర్ధంతి

విశాలాంధ్ర-పాలకొండ/వీరఘట్టం : రాష్ట్ర మంత్రిగా, సుదీర్ఘకాలం జిల్లా పరిషత్ చైర్మన్‌గా, శాసనమండలి సభ్యునిగా డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నో పదవులు చేపట్టి ఆ పదవులకే వన్నెతెచ్చిన ప్రజానాయకుడు ఉత్తరాంధ్ర ముద్దుబిడ్డ తూర్పు కాపు సామాజిక వర్గానికి వన్నెతెచ్చిన స్వర్గీయ గొర్లె శ్రీరాములునాయుడు అందరికీ ఆదర్శప్రాయుడని ఆంధ్ర యూనివర్సిటీ పాలకమండలి మాజీ సభ్యుడు ఎర్రపాత్రుని వెంకట్ నాయుడు పేర్కొన్నారు. గురువారం స్వర్గీయ గొర్లె శ్రీరాముల నాయుడు 20వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టంమండలం నడుకూరు గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నీతి, నిజాయితీలకు మారుపేరుగా నిబద్ధతగల రాజకీయ నాయకునిగా ఒంటి చేతితో ఉత్తరాంధ్ర రాజకీయాలను తన కన్ను సన్నలో నేరపిన గొప్ప నేత శ్రీరాములు నాయుడు అని కొనియాడారు. నేటి తరం నాయకులు శ్రీరాములు నాయుడుని ఆదర్శంగా తీసుకొని నీతివంతమైన సేవలు ప్రజలకు అందించాలని కోరారు. రైతుబిడ్డగా, రైతు సంక్షేమం కోసం మద్దువలస సాగునీటి ప్రాజెక్టు నిర్మాణం కోసం ఆయన చేసిన కృషికి గుర్తుగా ఆయన పేరుని ప్రభుత్వం పెట్టిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ముందుగా స్వర్గీయ గొర్లె శ్రీరాములు నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతిని వెలిగించి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు జయశ్రీ,నాయకులు వాన త్రినాథ్ నాయుడు,శంభాన చంద్రమౌళీశ్వరావు,కంటూ శ్రీరామ్మూర్తి, రైతు నాయకులు మంతిని పకీర నాయుడు, అలుగోలు కన్నం నాయుడు,దుర్గారావు, కింజంగి సాయి తదితరులు పాల్గొన్నారు.

ములకనపల్లి జోన్ కమిటీ సమావేశం

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని ములకన పల్లి పంచాయతీ పరిధిలోని కుందులూరు గ్రామంలో రవ్వ. బుచ్చయ్య ఇంటివద్ద రవ్వ.బుచ్చయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముల్కనపల్లి జోన్ కన్వీనర్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్న బాబు మాట్లాడుతూ ఆ సచివాలయం పరిధిలో మంచినీరు రహదారులు కరెంటు సమస్యలపై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కుందులూరు నుండి టేకులూరు వరకు బీటీ రోడ్ నిర్మించాలి అని. కుందులూరు మంచినీటి సమస్య పరిష్కరించాలని. జల్లి వారి గూడెం నుండి కుందులూరుఆర్ అండ్ బి రోడ్డు జంక్షన్ వరకు బీటీ రోడ్ నిర్మించాలని. మడివి గుంపు పీసం గుంపు మధ్యలో కలవర్టు నిర్మించాలని. మధ్యలో ఉన్న వాగు కి కల్వర్టు నిర్మించాలనీ. బంగారు గూడెం జల్లి వారి గూడెం మధ్య వాగుకి హై లెవెల్ వంతెన నిర్మించాలని. లేనిపక్షంలో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేపడతామని ఆయన అధికారులని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు సత్యనారాయణ.. జల్లి సత్యనారాయణ. శాఖ కార్యదర్శులు. మోసం సత్యనారాయణ. తెల్లం కన్నారావు. సోయం భద్రయ్య. కారం రమేష్ బంగారు ప్రసాద్. తదితరులు పాల్గొన్నారు.

44 పీసా కమిటీల ఎన్నికలు పూర్తి 3చోట్ల పెండింగ్

ఎంపీడీవో ఎస్ కేవి ప్రసాద్ వెల్లడి

విశాలాంధ్ర-కొయ్యూరు : గతవారం రోజులుగా మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో నిర్వహిస్తున్న పెసా ఎన్నికల్లో భాగంగా 47 కమిటీలకుగాను 44 చోట్ల పూర్తి కాగా, మరో మూడు కమిటీలకు పెసా ఎన్నికలు పెండింగ్ లో ఉన్నట్టు ఎంపీడీవో ఎస్ కె ఎల్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు రేవళ్ళు, కినపార్తి, రాజేంద్రపాలెం కమిటీలకు ఈ ఎన్నికలు జరగల్సి ఉందన్నారు. వీటిపై ఎప్పుడూ పూర్తి చేసేది ఆయా గ్రామాల్లో ప్రకటన చేస్తామని స్పష్టం చేశారు.ఇదిలా ఉండగా మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల నిర్వహణ, పెసా ఎన్నికల కమిటీలు నిర్వహణ పై మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో అన్నీ పంచాయితీల కార్యదర్శులు, డిజిటల్ వెల్ఫేర్ అసిస్టెంట్లుతో పాటు, విద్యా శాఖ, ఇంజినీరింగ్ అధికార్లుతో ఎంపీడీవో ఎస్‌కెవి ప్రసాద్ మండల పరిదిలో జరిగే పనులపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్, మరియు పిఓ ఆదేశాల మేరకు సంక్రాంతి నాటికి పూర్తి చేయాల్సిన రోడ్లు, కాలువలు, సిసి డ్రైన్ తదితర పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో వారికి ఆదేశించారు. ఈ సమావేశంలో ఇంజినీరింగ్ జెఈఈలు, కార్యదర్శులు, ఇంజిరింగ్, డిజిటల్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్

అంతర పంటలతో అధిక ఆదాయం

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండలం లోని చింతలబెలగాం గ్రామంలో పెద్దింటి కృష్ణ అరటిలో అంతరు పంటలుగా జొన్న, సజ్జ, ఆముదం, కంది, బీర, బెండ, గోంగూర, మెంతికూర, తోటకూర, చిక్కుడు, రాగి ఇలా 12రకాలు పంటలు వేయటం వలన అన్ని రకాల పోషకాలు కలిగిన ఆహార పదార్థాలు కుటుంబ అవసరాలకు వినియోగించుకోవడంతో పాటు అదనపు ఆదాయం మరియు కలుపునివారణ చేయవచ్చని రైతులందరూ ఇలా అంతరు పంటలు వేసుకొని నిత్య పంటలు -నిత్య ఆదాయం లభిస్తుందని, విత్తనాలు సేకరణ చేసుకోవడం కూడా దళారులు బెడద లేకుండా, బయట మార్కెట్ కొనుగోలు చేయకుండా, మన విత్తనం మనమే సేకరించుకోవడం వలన నాణ్యమైన దిగుబడులు పొందడానికి అవకాశం కలుగుతుందని, అంతర పంటలు వేయటం వలన మొక్కలలో జీవవైవిద్యం చెందడం వలన ప్రధాన పంట అరటి గెలలు పెద్ద సైజులో వచ్చాయిని, చినమెరంగి పాఠశాల ఖాళీ ప్రాంగణంలో కూడా పలు పంటలో లభించే విత్తనాలు సేకరణచేయడం, ఎటిఎం పంటలలో కూడా విత్తనాలు సేకరించుకుని ఖరీఫ్ లో నవధాన్యాలు విత్తనాలుగా వేసుకోవాలని ప్రకృతి వ్యవసాయ అసోషియట్ జి. అన్నపూర్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు గౌరమ్మ, కృష్ణ, మండలం ఇంచార్జ్ బి. ధనుంజయరావు, ఎం. సింహాచలం, రవి తదితరులు పాల్గొన్నారు

సైన్స్ అండ్ ఇన్నోవేషన్ ఫెయిర్‌కు అపూర్వ స్పందన

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండలంలోని చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సవరపు రవణ పర్యవేక్షణలో నిర్వహించిన సైన్స్ అండ్ ఇన్నోవేషన్ ఫెయిర్ 2025 కు ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థుల నుండి విశేష స్పందన లభించింది. చినమేరంగి, బిజెపురం హైస్కూల్ నుండి 9,10 తరగతుల విద్యార్థినీ విద్యార్థులు వచ్చి దీనిని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సవరపు రమణ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో ల్యాబ్ లు సైన్స్ అండ్ ఇన్నోవేషన్ ఫెయిర్ మెథడ్స్ పై కళాశాలలో ఉన్న అన్ని గ్రూప్ సబ్జెక్టులపై కళాశాల విద్యార్థులకు ఉన్న ప్రతిభను కళాశాలలో విద్యాబోధన పరిస్థితిని హైస్కూల్ విద్యార్థులకు పూర్తిగా తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని ప్రిన్సిపల్ అన్నారు. దీని ద్వారా రానున్న విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు పెంచి వారి భవిష్యత్తుకు బాధ్యత తీసుకోవడానికి చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి 2 ముదిలి శ్రీనివాసరావు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణీలు క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకోవాలి

చింతపల్లి ఏరియా ఆసుపత్రి వద్ద గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

విశాలాంధ్ర-చింతపల్లి : గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించుకోవడంతో పాటు ప్రతిరోజు పోషకాహారం తీసుకోవాలని మహిళా (స్త్రీ) వైద్యనిపుణురాలు రోజా అన్నారు. గురువారం ప్రధానిమంత్రి మాతృత్వ సురక్ష అభియన్ లో భాగంగా చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాలకు చెందిన సుమారు 50 మంది గర్భిణులకు స్థానిక ఏరియా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. కొంత మంది గర్భిణులు రక్తహీనతతో బాధపడుతున్నారని, అంగన్వాడీ కేంద్రాలు ద్వారా పంపిణీ చేస్తున్న పాలు, గుడ్లు, చక్కీలు, రాగిపిండి తదితర పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. రక్తహీనత వలన పలు రుగ్మతలు ఏర్పడడం జరుగుతుందని, బిడ్డ ఎదుగుదల ఉండదన్నారు. వీటిని అధిగమించాలంటే తప్పని సరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అంగన్వాడీలు, ఆశ కార్యకర్తలు గర్భిణులకు వీటిపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అటవీ ఉత్పత్తులపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-మక్కువ : మండలంలోని పనసభద్ర గ్రామపంచాయతీ పరిధిలో మెండంగి గ్రామంలో గిరిజనులు పండిస్తున్న అటవీ ఉత్పత్తులు కొనుగోలు ధరలపై అవగాహన సదస్సు గురువారం ఏర్పాటుచేయడం జరిగింది. ఈ సంవత్సరంలో చింతపండు కేజీ పిక్కతో 34 రూపాయలు కొండ చీపుర్లు 45 రూపాయలు దినుసులు సంబంధించి కొత్త ధరలుపట్టికను ఏర్పాటు చేసితిరి దళారుల వద్ద మోసపోవద్దని జిసిసి సేల్స్ మాన్ రమణారావు గిరిజనులకు తెలిపారు. కార్యక్రమానికి జిసిసి బ్రాంచ్ డైరెక్టర్ నూకమ్మ, పంచాయతీ సర్పంచ్ ఎస్ గంగన్న గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గర్భిణీ స్త్రీలకు సత్యసాయి ప్రేమామృతం

విశాలాంధ్ర-జియమ్మవలస : మండలంలో గల జియ్యమ్మవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద 60 మంది గర్భిణీ స్త్రీలకు సత్య సాయి భజన మండలి ఆధ్వర్యంలో ప్రేమామృత ప్రసాదాన్ని అందజేశారు. శిఖబడి గ్రామానికి చెందిన సత్యసాయి భక్తులు ఉపాధ్యాయులు రాయగడ లక్ష్మణరావు ఈ ప్రేమామృత ప్రసాదం అందించడానికి తగు మెటీరియల్ అందించినట్లు సత్య సాయి భజన మండలి జియ్యమ్మవలస కన్వీనర్ కోలక నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ పూలబంతి జగదీష్, వైద్య సిబ్బంది, సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

సంబరలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గర్భిణీలకు భోజనాలు

విశాలాంధ్ర-మక్కువ : మండలంలోని సంబర గ్రామంలో సత్యసాయి సేవ సమితి వారి ఆధ్వర్యంలో గురువారం సంబర పీహెచ్‌సి చుట్టుపక్కల గ్రామాల నుంచి ఏజెన్సీ ప్రాంతం నుండి గర్భిణీ స్త్రీలు ఆసుపత్రికి వస్తుంటారు. మక్కువ ఎంఈఓ సత్యనారాయణ తన వంతుగా గర్భిణీ స్త్రీలకు మధ్యాహ్న భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ ఎన్వి కిరణ్ డాక్టర్ పి.రమ్యసాయి దగ్గరుండి గర్భిణీ స్త్రీలకు భోజనాలు వడ్డించారు.

ఈనెల 12న జట్టు ఆశ్రమంలో యువజన ఉత్సవాలు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : ఈనెల 12న పార్వతీపురం పట్టణంలోని జట్టు ఆశ్రమంలో యువజన ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని పార్వతీపురం స్వచ్ఛ సుందర జిల్లా సమన్వయకర్త బి. రామగోపాల్ తెలిపారు. జాతీయ యువజన దినోత్సవం నేపథ్యంలో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పాఠశాలలు కళాశాలలో నిర్వహించిన స్వచ్ఛ సుందర పార్వతీపురం అంశాలకు సంబంధించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు సర్టిఫికెట్లు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రధానం చేయడం జరుగుతుందని తెలిపారు. వివిధ సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాల్సింది విద్యార్థులే : హెచ్‌ఎం

విశాలాంధ్ర-చింతూరు: సంస్కృతి, సాంప్రదాయాలను, పరిరక్షించాల్సిన విద్యార్థులదేనని జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం బాలకృష్ణ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి గురువారం సంబరాలు విద్యార్థులచే జరిపారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. భోగి మంటలు వేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వాతి, రమేష్, పెంటమ్మ, నాగరాజు, సుజాత, సుబ్బయ్య, రత్తయ్య, రాజు, భద్రయ్య, ప్రసాద్, శ్రీను, జయ, శ్రీరామ్, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఈయు డైరీ ఆవిష్కరణ

విశాలాంధ్ర-పాలకొండ : ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ 2025డైరీ ఆవిష్కరణ గురువారం మాజీ మున్సిపల్ చైర్పర్సన్ ప్రతినిధి టీడిపి అగ్రనాయకులు పల్లా కొండబాబు చేతుల మీదగా ఆవిష్కరణ కార్యక్రమం ఎంప్లాయిస్ యూనియన్ అగ్ర నాయకుడు బికే మూర్తి ఆర్టిసి కార్మికులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండబాబు సోదరుడు మున్సిపల్ చైర్ పర్సన్ పల్లా ప్రతాప్ రావు కూడా ఉన్నారు.

వైభవంగా సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-చింతపల్లి : పర్యాటక ప్రాంతంగా పేరొందిన ఆంధ్ర కశ్మీర్ లంబసింగి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో సంక్రాంతి సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.ఎస్.ఎన్ రాజు, వసతిగృహ అధికారిని ఎన్ కవిత నాయుడు ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సంక్రాంతి సంబరాలలో రంగవల్లులతో పాటు, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సంబరాలలో భోగి మంటలు వేశారు. చిన్నారులు వేసిన హరిదాసు తదితర వేషధారణలు ఆహుతులను విశేషంగా ఆకర్షించాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయునీలతో పాటు, విద్యార్థినిలు ప్రత్యేక వస్త్రాలంకరణలతో రంగవల్లుల పోటీలలోనూ, సాంప్రదాయ నృత్య ప్రదర్శనలలోనూ భాగస్వాములు అయ్యారు.

జి.మాడుగుల : మండల కేంద్రంలో గల బీవీకే పాఠశాలలో సంక్రాంతి పండగ ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం సంక్రాంతి సెలవులు ముందుగానే బివికే పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులు కలిసి సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించుకుంటారు. భోగి మంటలు వేశారు అలాగే సంక్రాంతి ముగ్గులతో పాఠశాల ఆవరణ సుందరవదంగా కనిపించింది. ఈ పండగ వాతావరణంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పలు సాంస్కృతక కార్యక్రమాలు అలరించారు. ఈ కార్యక్రమంలో బివికే ప్రిన్సిపల్ సూర్య ప్రకాష్ రావు, టీచర్స్ సుదర్శన, కమలకుమారి, నాగజ్యోతి, వాణి, హనీషా, ప్రమీల విద్యార్థులు పాల్గొన్నారు.

అడ్డతీగల : మండలంలోని వేటమామిడి గ్రామంలో ఉన్న హెరాసన్నా హై స్కూల్లో సంక్రాంతి సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు టీచర్లు,ఆట పాటలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సాహంగా పాల్గొని అలరించారు.ఇందులో భాగంగా పిట్టల దొర కవ్వింతలు సాంస్కృతిక నృత్యాలు మరియు ఏజన్సీ ప్రత్యేక దింషా ప్రధాన ఆకర్షణ గా నిలిశాయి. సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన స్కూల్ డీన్ నందీవ్, ప్రిన్సిపాల్ మృధుహాసిని తమ గ్రీటింగ్స్ తెలియ జేశారు. విద్యార్థుల ప్రతిభ ను అభినందిస్తూ వారి సంక్రాంతి పండగ యొక్క సంప్రదాయ విలువలను గుర్తు చేశారు. సంస్థ డైరెక్టర్ డేనియేలు సందీప్ శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం అంతా రంగు రంగు లతో శోభాయ మానంగా అలంకరించారు.

కురుపాం : మండలంలోని అన్ని ప్రైవేటు ,ప్రభుత్వ పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు ను ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక

సరస్వతీ విద్యానికేతన్ లో ప్రిన్సిపాల్ కె.శ్రీ రామమూర్తి నాయుడు తెలుగు పండగలు ప్రాముఖ్యత ,సంక్రాంతి విశిష్టత విద్యార్థులు వివరించారు. సంక్రాంతి సంబరాలు లో భాగంగా రంగులు తో ముగ్గులు వేసి భోగి మంటలు వెలిగించి తెలుగు సంప్రదాయ వస్త్రాలు ధరించి నృత్యాలు చేశారు. అలాగే ఎపి మోడల్ స్కూల్ లో ఉపాధ్యాయులు ,విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి భోగి మంటలు వేశారు.

అంగన్వాడీ ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర-రంపచోడవరం : రంపచోడవరం డివిజన్లోని 5 ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలోగల అంగన్వాడీ కేంద్రాలలో అదనంగా మంజూరు అయిన 39 మంది ఆయాలను కమిటీ ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగిందని రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ పేర్కొన్నారు. బుధవారం ఉదయం 10 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు స్థానిక సబ్ కలెక్టర్ వారి కార్యాలయ చాంబర్లో కొత్తగా మంజూరైన 39 అంగన్వాడీ కేంద్రాలకు సంబంధించిన ఆయాలను కమిటీ ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రంపచోడవరం డివిజన్ పరిదిలో 5 ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో గల అంగన్వాడి కేంద్రాలకు అదనంగా 39మంది అంగన్వాడి కేంద్రాలలో ఆయాలను జిల్లా కలెక్టర్వారి ఆదేశాల మేరకు ఇంటర్యులు నిర్వహించడం జరిగిందని ఆమె తెలిపారు. రాజవొమ్మంగి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో 2 ఆయా పోస్టులకు 6 గురు దరఖాస్తులు చేసుకున్న వారికి, అడ్డతీగల ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో 16 ఆయా పోస్టులకు 39 మంది దరఖాస్తుదారులకు, గంగవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో 2ఆయా పోస్టులకు 6 గురు దరఖాస్తుదారులకు, రంపచోడవరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో 2 ఆయా పోస్టులకు 5 గురు దరఖాస్తుదారులకు, మారేడుమిల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో 17 ఆయా పోస్టులకు 17మంది దరఖాస్తు చేసుకున్న మొత్తం 39 ఆయా పోస్టులకు 75మంది దరఖాస్తులు చేసుకున్న వారిలో 73మంది ఇంటర్వ్యూలకు హాజరైన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్య కుమారి, రంపచోడవరం ఏడీఎం&హెచ్‌ఓ జి.శిరీష, ఐసిడిఎస్ సిడిపిఓలు సంధ్యారాణి, లక్ష్మీ ప్రసన్న, దేవమణి ఆయాల ఎంపిక కమిటీ ద్వారా నిబంధనల ప్రకారం పారదర్శకంగా ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగిందని సబ్‌కలెక్టర్ తెలిపారు. ఎంపికైన ఆయా పోస్టులకు పూర్తిస్థాయిలో ప్రభుత్వ నిబంధన ప్రకారం పరిశీలించి కలెక్టర్ వారి ఉత్తర్వులు ప్రకారం ఎంపికైన వారికి త్వరలో సంబంధిత గ్రామాల అంగన్వాడీ కేంద్రాలలో ఆయాలుగా నియమించడం జరుగుతుందని ఆమె తెలిపారు.

మాచ్ ఖండ్ బ్యాక్ వాటర్ వద్ద పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : ముంచంగిపుట్టు మండలం సజనకోట గ్రామం వద్ద మాచ్ ఖండ్ బ్యాక్ వాటర్ వద్ద పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం పర్యాటక అభివృద్ధి, అరకు ఉత్సవం 25 పై కలెక్టరేట్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం సుజన కోట పంచాయతీలో పర్యటించానని మాచ?ండ్ రిజర్వాయర్ కేజ్ కల్చర్, ప్యారా సైలింగ్, పర్యాటక అభివృద్ధికి అనుకూలంగా ఉందన్నారు. రిజర్వాయరు పరివాహక ప్రాంతంలో 350 మంది వరకు మత్స్యకారులు ఉన్నారన్నారు. మత్స్యకారులతో సొసైటీ ఏర్పాటు చేయాలని సూచించారు. కేజ్ కల్చర్ ఏర్పాటుకు బ్యాంకుల నుండి రుణాలు ఏర్పాటు చేస్తామన్నారు. రూ.5 లక్షల పెట్టుబడితో కేజ్ కల్చర్ ఏర్పాటు చేస్తే మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి దోహద పడుతుందన్నారు. గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కేజ్ కల్చర్ ఉపయోగంగా ఉంటుందని అన్నారు.

గిరిజన సంస్కృతి ఉట్టిపడేలా అరకు ఉత్సవం : గిరిజన సంస్కృతి ఆచార సాంప్రదాయాలు ప్రతిబింబించేలా అరకు ఉత్సవం నిర్వహించాలని చెప్పారు. ఉత్సవం నిర్వహణ ఏర్పాట్లపై పలు ఆదేశాలు జారీ చేసారు. సాంస్కృతిక ప్రదర్శనకు అవసరమై కళాకారుల వివరాలు సేకరించి. రవాణా, వసతి సౌకర్యాలు సమకూర్చాలని చెప్పారు. ప్రతీ రోజు నిర్వహించవలసిన కార్యక్రమాలపై చర్చించారు. ఫుడ్కోర్టులు, ఎమ్యూజ్మెంట్, పార్కింగ్, స్టాల్స్ ఏర్పాట్లపై పలు సూచనలు చేసారు. మొబైల్ టవర్ ఆన్ వీల్స్, మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని చెప్పారు. గిరిజన మ్యూజియం, గిరి గ్రామ దర్శిని, పద్మాపురం గార్డెన్లను సందరంగా అలంకరించాలని చెప్పారు. అరకు పట్టణంలో విద్యుత్తు దీపాలు అన్ని వెలిగే విధంగా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, ఐటీడిఏ, పి. ఓ. వి. అభిషేక్ సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, మ్యూజియం మేనేజర్ మురళి, పర్యాటక శాఖ అధికారులు ఎంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండుగగా స్వామివారి తెప్పోత్సవం

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని రెండవ భద్రాద్రిగా పేరుగాంచిన శ్రీరామగిరి గ్రామంలో వెలసియున్న శ్రీసుందర సీతారామచంద్రస్వామి వారి తెప్పోత్సవం ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకునీ గురువారం సాయంత్రం పవిత్ర గోదావరి నదిపై ఏర్పాటుచేసిన బోటుపై కన్నుల పండుగగా నిర్వహించారు. సాయంత్రం శ్రీరామగిరి గుట్ట మీద గుడి నుండి స్వామివారి ఉత్సవ విగ్రహాలను గ్రామంలోని పురవీధులలో ఊరేగింపుగా భక్తజన సందోహం మధ్య తీసుకొని వచ్చి పవిత్ర గోదావరి శబరి నది సంఘమ ప్రాంతంలో ఏర్పాటుచేసిన బోటుపై స్వామివారిని ఆసీనులను చేసి, ప్రధానార్చకులు పురుషోత్తమా చార్యులు వేద పండితుల ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలు నడుమచూసు వారాలకు చూడ ముచ్చటగా స్వామివారి తెప్పోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు ప్రజాప్రతినిధులు గ్రామ పెద్దలు భక్తజనులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు నివారణకు చర్యలు : ఎస్సై కే.నీలకంఠం

విశాలాంధ్ర-కొమరాడ : రోడ్డు ప్రమాదాలు ప్రమాదాలు నివారణకు అవసరమైన కార్యవరణ చేపడుతున్నామని కొమరాడ ఎస్సై కే నీలకంఠం అన్నారు. గురువారం పార్వతిపురం నుండి కూనేరు రహదారిపై చుట్టుపక్కల ఉన్న తుప్పలు, డొంకలను ఆయన జెసిబి సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారుల్లో వాహనదారులకు ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలను చేపడుతున్నామని అయితే రోడ్డు పరిస్థితులను అంచనా వేసుకుని వాహనదారులు ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపడతామని ఆయన అన్నారు.

వెనుకబడిన విద్యార్థుల కొరకు ప్రత్యేక శ్రద్ధతో బోధించాలి

బలిజిపేట ఎంఈఓ 1 సామల

విశాలాంధ్ర-బెలగాం/బలిజిపేట : వెనుకబడిన విద్యార్థుల కోసం తరగతి టీచర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బోధన చేయాలని బలిజిపేట మండల విద్యాశాఖాధికారి 1 సామల సింహాచలం అన్నారు. గురువారం ఆయన పెద్దింపేట, పోలినాయుడు వలస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. ముందుగా పెద్దింపేట పాఠశాలలో విద్యార్థుల పఠన, రాత నైపుణ్యాలను పరిశీలించారు. విద్యార్థులతో తెలుగు ఆంగ్లం భాష అంశాలను చదివించారు. ఐదవ తరగతి విద్యార్థులకు గణితంలో భిన్నాలను గూర్చి ప్రశ్నలు వేసి నల్లబల్లపై విద్యార్థులతో చేయించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థినీ విద్యార్థులు వేసిన సంక్రాంతి రంగవల్లులను పరిశీలించి అభినందించారు. పోలినాయుడు వలస పాఠశాలలో బడి తోటను పరిశీలించారు. వివిధ రకాల కూరగాయల మొక్కలను, పూల తోటను శ్రద్ధగా పెంచుతుండటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక ఆశా వర్కర్ ద్వారా విద్యార్థినీ విద్యార్థులకు పోలిక్ యాసిడ్ టాబ్లెట్స్ ను వేయించారు. టీచర్లు సిలబస్ ప్రకారం డైరీలను, లెసన్ ప్లాన్స్‌ను పెండింగ్ లేకుండా సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల్లో చేతిరాత నైపుణ్యాలను ఇంకా అభివృద్ధి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

శీతాకాలంలో అప్రమత్తంగా ఉండండి

- ఉన్ని దుస్తులతో రక్షణ పొందండి
- కాచి చల్లార్చిన గోరువెచ్చని నీటిని తాగాలి
- వేడి పదార్థాలను మాత్రమే భుజించాలి
- తాజంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సంతోష్ కుమార్‌బాబు

విశాలాంధ్ర-చింతపల్లి : శీతాకాలంలో మన్యంలో పెరుగుతున్న చలి తీవ్రత దృష్ట్యా మన్య వాసులంతా అప్రమత్తంగా ఉండాలని తాజంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సంతోష్ కుమార్ బాబు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ నిత్యం శీతల వాతావరణానికి ప్రసిద్ధి గాంచిన ఆంధ్ర కశ్మీర్ లంబసింగి, తాజంగి ప్రాంతాలలో పర్యాటకంతో పాటు శీతల గాలులు, చలి తీవ్రత అధికంగా ఉంటుందన్నారు. ఈ పరిస్థితి శీతాకాలంలో మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ విధిగా ఉన్ని దుస్తులు ధరించాలన్నారు. వృద్ధులు, చిన్నారులు, శ్వాస కోస వ్యాధిగ్రస్తులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ శీతాకాలంలో కాచి చల్లార్చిన గోరువెచ్చని నీటిని త్రాగాలన్నారు. వేడి పదార్థాలను మాత్రమే భుజించాలని, శీతల గాలులు చెవులకు శోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

దొంగల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలి : పట్టణ సిఐ మురళీధర్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: సంక్రాంతి పండగ సందర్భంగా దొంగల పట్ల ప్రజలు జాగ్రత్త వహించాలని పట్టణ సిఐ కె.మురళీధర్ అన్నారు. గురువారం పత్రిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ బస్సు ఎక్కేటప్పుడు గాని, దిగేటప్పుడు గాని, షాపింగ్ చేసినప్పుడు గాని,మీదగ్గర ఉన్న విలువైన వస్తువులు జాగ్రత్త, అదే పనిగా మీ అజాగ్రత్తని గమనించి, రద్దీగా ఉన్నట్లు భ్రమ కల్పించి,మీదగ్గర ఉన్న విలువైన వస్తువులను దొంగలు మీలో ఒకడిగా ఉండి దొంగిలించవచ్చన్నారు.సరదా కొరకు మీదగ్గర ఉన్న బైక్ ని మైనర్ల కు డ్రైవింగ్ చేయడానికి ఇవ్వవద్దని దీనివల్ల మీఇద్దరకూ ప్రాబ్లమ్ రావచ్చనీ,అతివేగం అర్ధ-అయువుకి సంకేతం, మద్యం త్రాగి వెహికల్ నడపటం, హెల్మెట్ లేని ప్రయాణం నేరం, పండగ సందర్భంగా నాటు సారా తయారు చేసినా, అమ్మినా, కోడి /గొర్రె పందేలు ఆడినా, పేకాట, డైస్ గేమ్లు ఆడినా పట్టణ పోలీస్ వారు కఠిన చర్యలు తీసుకోబడుననీ హెచ్చరించారు.దొంగలు చేస్తున్న ప్రతీ తప్పుడు పనులన్నీ పట్టణ సిసి కెమెరా పర్యవేక్షణలో ఉన్నదని సూచించారు.

శానిటేషన్ సిబ్బందికి భద్రతా సామాగ్రి పంపిణీ

విశాలాంధ్ర-పాలకొండ : నగర పంచాయతీలోని శానిటేషన్ సిబ్బందికి భద్రత కిట్లను నగర పంచాయతీ చైర్మన్ పల్లా ప్రతాపరావు, కమిషనర్ సామంచి సర్వేశ్వర రావులు గురువారం అందజేశారు. పట్టణంలోని సెప్టిక్ ట్యాంక్ క్లినింగ్ కోసం వెళ్లే కార్మికులకు ఎంపిక చేసిన సిబ్బందికి ప్రభుత్వం నుంచి వచ్చిన గ్లౌజ్‌లు,మాస్కులు,షూలు తదితర సామగ్రిని వారికి అందజేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్, కౌన్సిలర్లు వెలమల మన్మథరావు (వైకాపా పట్టణ అధ్యక్షుడు), కిల్లారి మోహనరావు, కడగల వెంకటరమణ, తూముల లక్ష్మణరావు, పడాల రాంబాబు తదితరులు సచివాలయ సిబ్బంది హేమంత్ కుమార్ ఉన్నారు.

44 పెసా కమిటీల ఎన్నికలు పూర్తి... 3 చోట్ల పెండింగ్

ఎంపీడీవో ఎస్ కేవి ప్రసాద్ వెల్లడి

విశాలాంధ్ర-కొయ్యూరు : గతవారం రోజులుగా మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో నిర్వహిస్తున్న పెసా ఎన్నికల్లో భాగంగా 47 కమిటీలకుగాను 44 చోట్ల పూర్తి కాగా, మరో మూడు కమిటీలకు పెసా ఎన్నికలు పెండింగ్ లో ఉన్నట్టు ఎంపీడీవో ఎస్ కె ఎల్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు రేవళ్ళు, కినపార్తి, రాజేంద్రపాలెం కమిటీలకు ఈ ఎన్నికలు జరగల్సి ఉందన్నారు. వీటిపై ఎప్పుడూ పూర్తి చేసేది ఆయా గ్రామాల్లో ప్రకటన చేస్తామని స్పష్టం చేశారు.ఇదిలా ఉండగా మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల నిర్వహణ, పెసా ఎన్నికల కమిటీలు నిర్వహణ పై మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో అన్నీ పంచాయితీల కార్యదర్శులు, డిజిటల్ వెల్ఫేర్ అసిస్టెంట్లుతో పాటు, విద్యా శాఖ, ఇంజినీరింగ్ అధికార్లు తో ఎంపీడీవో ఎస్ కె వి ప్రసాద్ మండల పరిదిలో జరిగే పనులపై సమీక్షించారు. కలెక్టర్, పిఓ ఆదేశాలమేరకు సంక్రాంతి నాటికి పూర్తి చేయాల్సిన రోడ్లు, కాలువలు, సి సి డ్రైన్ తదితర పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో వారికి ఆదేశించారు. ఈ సమావేశంలో ఇంజినీరింగ్ జెఈఈలు, కార్యదర్శులు, ఇంజీరింగ్, డిజిటల్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరకే గోగునార కొనుగోలు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: మద్దతు ధరకే గోగునారను కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని జ్యూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ పార్వతీపురం ప్రాంతీయ కార్యాలయ అధికారులు ఆర్ అరుణ్, డిప్యూటీ మేనేజర్ (మార్కెటింగ్) కే రాంకిరణ్ ఎడిఎంఎం అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంవత్సరానికి సుమారు 5 క్వింటాల్లతో రైతుల నుంచి ముడి జనపనారను సేకరించడం ప్రారంభించడం జరిగిందన్నారు.జనపనార నాణ్యతగా మెరుగుపరచటానికి, జూట్ రైతులను ప్రధానంగా తోసా జూటును పండించడానికి ప్రోత్సహించేందుకు ఐ కేర్ ప్రాజెక్ట్ ని కూడా గత సంవత్సరం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు.అదే తోసా రకం నార ఇప్పుడు ఎం ఎస్ పి కింద కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు.ఈ కొత్త రకాన్ని సాగుచేసిన రైతులు పంటతోపాటు ఈ రకము ద్వారా వచ్చే లాభాలతో సంతృప్తి చెందడం జరుగుతుందన్నారు.కొత్త రకాన్ని పండించేలా రైతులను ప్రోత్సహిస్తూ అన్ని రకాల నారను కనీస మద్దతు ధరకే కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.రాబోయే పంటకాలంలో అధిక విస్తీర్ణంలో జనపనార సాగు చేయడం జరుగుతుందనీ దీనికోసం వ్యవసాయ శాఖ అనుసంధానంతో జుట్ కార్పొరేషన్ కార్యాలయం ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందన్నారు.

రుణాల రికవరీ లక్ష్యాలను పూర్తి చేయాలి : ఎంపీడీవో

విశాలాంధ్ర-గంగవరం : మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం ఇచ్చిన రుణాల రికవరీ లక్ష్యాలను వెలుగు సిబ్బంది పూర్తి చేయాలని ఎంపీడీవో పిజి రామకృష్ణ సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వెలుగు ఏపీఎం షణ్ముఖేశ్వర రావు ఆధ్వర్యంలో జరిగిన బ్యాంకర్లు, వెలుగు సిబ్బందితో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎంపీడీవో రామకృష్ణ మాట్లాడారు. బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి, ఉమెన్ లీడ్ ఎంటర్ప్రైజెస్‌ల ఏర్పాటు కు సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు .డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించే విధంగా సిబ్బంది కృషి చేయాలని, అలాగే సకాలంలో రుణాలు చెల్లించిన సంఘాలకు తిరిగి రుణాలు మంజూరయ్యే విధంగా బ్యాంకర్లతో మాట్లాడి రుణాలు మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గంగవరం స్టేట్ బ్యాంక్ మేనేజర్ జగదీష్, క్యాష్ ఆఫీసర్ లక్ష్మణరావు, వెలుగు సిసిలు

వాడివేడిగా మండల సమావేశం

విశాలాంధ్ర-వై రామవరం : గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో జన్‌మన్ పథకం కింద మంజూరైన 600 గృహాలను మధ్యలో ఆపకుండా సరైన కాంట్రాక్టర్ల ద్వారా ఇల్లు పూర్తి చేయాలి అని ఎంపీపీ, ఎంపీటీసీ రమణ కోరారు. బిల్డింగ్ లేని పాఠశాలలకు భవనాల కొరకు ప్రతిపాదనలు చేయాలన్నారు. పుట్టగండిలో ఉపాధ్యాయుడు విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఎంఇఓకు సూచించారు. భూమి పంపకాలలో లేటు డెత్ సర్టిఫికెట్‌లు ఇచ్చేందుకు తీవ్ర జాప్యం చేస్తున్నారని,లేటు డెత్‌లు, లేటు బర్త్ సర్టిఫికేట్‌లు సకాలంలో అందివ్వాలని ఎంపీటీసీ రమణ తహసీల్దార్ ను కోరారు. ఏజెన్సీలో కేటగిరి 2 మీటర్లు ఇచ్చేందుకు పీవో పర్మిషన్ తీసుకోవాలని నిబంధనలతో గిరిజనులు వ్యాపారాలకు ఇబ్బందులు ఎదురవుతాయని వాటి గురించి చర్యలు తీసుకోవాలని సభ్యులు తెలిపారు. సమావేశాలకు ప్రజా సమస్యలతో సుదూర ప్రాంతాల నుంచి వస్తున్నామని పలు శాఖల అధికారులు హాజరుకావడం లేదని వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎంపీటీసీ రమణ ఎంపీడీవో రవికిషోర్ ను కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు విశ్వమ్మ, జోగిరెడ్డి, తహసీల్దార్ వేణుగోపాల్,పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో సమీక్ష సమావేశం

విశాలాంధ్ర-అనంతగిరి : మండలంలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ లతో మండలా అభివృద్ధి కార్యక్రమాలకు పై సమీక్ష సమావేశం నిర్వహించి తగు సూచన చేసినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏవివి కుమార్ తెలిపారు. గురువారం నాడు మండల పరిషత్ కార్యాలయంలో పలు అంశాలపై తగు సూచనలు చేశామని తెలిపారు. ముఖ్యంగా గ్రామాలలో ఇంటింటికి తాగునీరు సదుపాయానికి సంబంధించి జలజీవన్ మిషన్ పథకానికి సంబంధించి విలేజ్ వాటర్ శానిటేషన్ కమిటీ ఏర్పాటు చేయాలని ఆ కమిటీకి బ్యాంకు ఖాతా తెరిపించాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఆదేశాలు జారీ చేశారు. జలజీవన్ మిషన్ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు దృష్టి పెట్టాలని ఆదేశించారు. అలాగే అంగన్వాడి కేంద్రాల వద్ద త్రాగునీరు సదుపాయం మరుగుదొడ్లు ఏర్పాటు వంటివి ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. కమ్యూనిటీ కాంప్లెక్స్ మరియు పర్యాటక ప్రాంతాలలో కొత్తగా మరుగుదొడ్లు సదుపాయం కల్పించాలని అన్నారు. అదేవిధంగా హౌసింగ్ కి సంబంధించి పి ఎం ఏ వై గ్రామీణ లో ఉన్న ఇల్లులకు బిల్లులు చెల్లించేందుకు దృష్టి పెట్టాలని తెలిపారు. అంతా మొదలుపెట్టని పిఎం జన్మన్ పథకంలో మంజూరైన గృహాలను లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణాలు పై స్పీడ్ పెంచాలని సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఆదేశించారు. వివిధ దశలో ఉండే అశ్వంపూర్తిగా ఉన్న నిర్మాణం కూడా పూర్తి చేయించాలని హౌసింగ్ ఏఈ సమక్షంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు చొరవ చూపాలనారు. ఈ సమీక్ష సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ ఇంజనీరింగ్ అధికారి పి.నాగేశ్వరరావు, గ్రామీణ నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ పి గౌతమ్, పంచాయతీ విస్తరణ అధికారి లాలం సీతయ్య, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేడు కామ్రేడ్ బన్నిన మల్లయ్య 18వ వర్ధంతి

సిపిఐ పార్టీ మండల కార్యదర్శి ఇరవాడ దేముడు

విశాలాంధ్ర-కొయ్యూరు : భారత కమ్యూనిస్టు పార్టీ నాయకుడు కామ్రేడ్ బన్నిన మల్లయ్య 18వ వర్ధంతి నేడు అంతాడ పంచాయతీ కొత్తపల్లిలో నిర్వహించడం జరుగుతుందని సిపిఐ పార్టీ మండల కార్యదర్శి ఇరవాడ దేముడు తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో దేవుడు మాట్లాడుతూ కామ్రేడ్ బన్నిన మల్లయ్య వర్ధంతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అనకాపల్లి జిల్లా కార్యదర్శి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ మరియుఅల్లూరి సీతారామరాజు జిల్లా భారత కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. ఈ వర్ధంతి కార్యక్రమానికి మండలంలో ఉన్న కమ్యూనిస్టు పార్టీ నాయకులు కార్యకర్తలు సానుభూతిపరులు అభిమానులు అధిక సంఖ్యలో తరలి రావాలని ఆయన కోరారు.

విద్యార్థిదశ నుంచి ఉత్తమ లక్ష్యం కలిగి ఉండాలి

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి
ఏపీ ఎంజేపీ ప్రిన్సిపాల్ సత్యనారాయణ

విశాలాంధ్ర-కురుపాం : విద్యార్థిదశ నుంచి అందరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ భవిష్యత్ కోసం ఉత్తమ లక్ష్యం కలిగి ఉండాలని మహాత్మా జ్యోతిభాపూలే వెనుక బడిన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పి.సత్యన్నారాయణ అన్నారు. గురువారం సెట్విజ్ సహకారంతో యస్ సొసైటీ ఆధ్వర్యంలో కురుపాం బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠ శాలలో చదువుతున్న విద్యా ర్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్ మరియు డ్రగ్స్, మాదక ద్రవ్యాలు నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఆశీరయ్య. మహిళా కానిస్టేబుల్ లక్ష్మీ, యస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ హాజరయ్యారు వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మొబైల్ ఫోన్స్ ద్వారా కేవలం విద్య విజ్ఞానం మాత్రమే ఉపయోగించాలని అనవసరమైన ఆన్లైన్ గేమ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు విద్యార్థుల కు వ్యక్తిగత ఆరోగ్యం, పరిశుభ్రత, ఏకాగ్రత వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయనీ తద్వారా ఉత్తమ పౌరులుగా గుర్తింపు పొందుతారని అన్నారు, కమ్యూనికేషన్ స్కిల్స్ చాల ముఖ్యం అని సూచించారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఒత్తిడికి దూరంగా ఉండి పరీక్షలకు సన్నద్ధం కావాలి అని కోరారు. ఈ కార్యక్రమానికి పాటశాల ఉపాధ్యాయులు ఫాతిమా, వార్డెన్, సిబ్బంది హాజరయ్యారు అనంతరం విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు.

అటవీ, వ్యవసాయ ఉత్పత్తుల లక్ష్యం 12 కోట్లు

జిసిసి డిఎం మహేంద్ర కుమార్

విశాలాంధ్ర-పార్వతీపురం/బెలగాం : పార్వతీపురం డివిజన్ పరిధిలో 202420 సంవత్సరంసకు డివిజన్ పరిధిలోగల పార్వతీపురం సాలూరు గుమ్మలక్ష్మీపురం బ్రాంచీల పరిధిలో అటవీ మరియు వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు లక్ష్యం 12 కోట్లు కాగా ఇప్పటివరకు సుమారు 6 కోట్లు లక్ష్యం సాధించామని జిసిసి డివిజనల్ మేనేజర్ వి. మహేంద్రకుమార్ అన్నారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ ఇతర నిత్యావసరాలు ఇతర డొమెస్టిక్ రిక్వైర్మెంట్స్ గ్యాస్ పెట్రోల్ బంక్లు సూపర్ బజార్లు అన్ని కలిపి 62 కోట్ల లక్ష్యం కాగా ఇప్పటి వరకు 42 కోట్లు పురోగతి సాధించామన్నారు. ప్రస్తుత ఎం.ఎఫ్.పి సీజన్ ప్రారంభమైనందున కొనుగోలు ప్రారంభించామన్నారు. ఇప్పటికే బ్రాంచీల పరిధిలో ఉన్నటువంటి అన్ని కొనుగోలు కేంద్రాల్లో ఎం.ఎఫ్.సి ధరలు సూచించే పట్టికలు ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగా పార్వతీపురం ఏజెన్సీ ప్రాంతంలో చింతపండు ఫలసాయం అధికంగా ఉండుట చేత నాణ్యమైన చింతపండు ధరను రూ.34 జిసిసి వైస్ చైర్మన్ మరియు మేనేజర్ డైరెక్టర్ అయిన కల్పనా కుమారి నిర్ణయించారని దీనితో పాటుగా మిగతా అటవీ ఉత్పత్తులు కూడా ధర నిర్ణయించారని కరక్కాయలు 18 రూపాయలు నుంచి 20 రూపాయలు, ముసిడిక 90 రూపాయలు నుండి వంద రూపాయలు, తూనికాకు 15 రూపాయల నుండి 18 రూపాయలు, నల్లజీడి 18 నుండి 22 రూపాయలు, కాగు పట్టు 22 నుండి 25 రూపాయలు, పిక్క తీసిన చింతపండు 63 నుండి 67 రూపాయలు, విప్పపప్పు 29 నుండి 32 రూపాయలు ధరలు పెంచామన్నారు. ఇందుకనుగుణంగా గిరిజన గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేశామన్నారు. అదే విధముగా కరపత్రాలు ముద్రించి ఇచ్చామన్నారు. దీనిని గిరిజన రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా అటవీ ఉత్పత్తుల నాణ్యత తగ్గకుండా చూడాలని కోరారు. మన జిల్లాలో పండిన కొన్ని అటవీ ఉత్పత్తులని వాల్యూ ఎడిషన్ (విలువ ఆధారిత) వస్తువులుగా తయారు చేస్తున్నామన్నారు. ఉసిరి పొడి కుంకుడు శీకాయ త్రిఫల మొదలగునవి అని తెలిపారు.

గిరిజనులకు ఆదాయ మార్గాలపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-కొయ్యూరు : కొయ్యూరు మండలం, అంతాడ గ్రామ పంచాయతీ కేంద్రంలో రేవతి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్ వి ఎస్ ఆర్ ప్రసాదు లిఫ్ట్ రూరల్ డెవలప్మెంట్ వెల్ఫేర్ సొసైటీ గౌరవ అధ్యక్షులు వి అప్పారావు ఆధ్వర్యంలో గంధం అగ్రో ఫుడ్స్ సహకారంతో ఈ ప్రాంతంలో విరివిగా పండే జీడి పండులు, జీడి పిక్క ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పడం ద్వారా రైతులకు ఆదాయం పెంచే కార్యక్రమాలపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గంధం అగ్రో ఫుడ్స్ సిఇఓ గంధం లక్ష్మి సునీత పాల్గొని అవగాహన సదస్సు లో మాట్లాడుతూ గిరిజనులు వ్యవసాయ రంగంలో ఆదాయ మార్గాల లక్ష్యంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు దీనికి సంస్థ అన్ని విధాల తోడ్పాటును అందిస్తుందని దానిని గిరిజన ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని ఆమె కోరారు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ప్రభుత్వ అధికారుల సలహాలు సూచనలతో మా వంతు సహకారం అందిస్తామన్నారు. ఇందులో గ్రామ మహిళలు, రైతులు, యువత పాల్గొని గంధం అగ్రో ఫుడ్స్ ద్వారా అందించే సలహాలను భవిష్యత్తులో పాటిస్తామని, ఇంకా ఇటువంటి కార్యక్రమాలు ఎన్నో చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుర్ల చందరరావు, మాజీ సర్పంచ్ సాలేబు సన్యాసిరావు, సిపిఐ నేత మాజీ సర్పంచ్ ఇరవాడ దేముడు, గంధం అగ్రో ఫుడ్స్ కో ఆర్డినేటర్ రమేష్, బిజెపి జిల్లా గిరిజన మోర్చ అధ్యక్షులు అరిమెల రాజు, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు రీమల చందరరావు, సామాజిక సేవకుడు అర్జున్ రెడ్డి, సమరసతా సేవా ఫౌండేషన్ మండల ధర్మ ప్రచారక్ సెగ్గె సన్యాసిరావు, బచ్చల లక్ష్మణరావు, మహిళలు, రైతులు, యువతీయువకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలను పటిష్టంగా అమలుచేయాలి

ఐద్వా చింతూరు మండల కమిటీ

విశాలాంధ్ర-చింతూరు : మహిళలపై రోజురోజుకు అత్యాచారాలు, అఘాయిత్యాలు , పెరిగిపోతున్నాయని చట్టాలు ఉన్నా అమలు శూన్యంగా ఉందని మహిళా రక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేసి మహిళలకు రక్షణ కల్పించాలని ఐద్వా మహిళా సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు మల్లం సుబ్బమ్మ, ముర్రం రంగమ్మ, డిమాండ్ చేశారు. గురువారం ఏడుగురాళ్లపల్లిలో ఐద్వా మహిళా సంఘం చింతూరు మండల కమిటీ ఆధ్వర్యంలో మహిళలకు సంక్రాంతి సంబరాలు సందర్భంగా వివిధ రకాల ఆటల పోటీలు, రంగోలి, మహిళా సదస్సు నిర్వహించడం జరిగినది ఈ సందర్భంగా విచ్చేసిన మహిళలకు రంగవల్లిలు, ముగ్గుల పోటీలను, తాడాట, కుర్చీ ఆట, బంతి ఆట, నిర్వహించినారు. అనంతరం గెలుపొందిన మహిళలకు ప్రథమ ద్వితీయ ఉత్తమ ప్రదర్శన బహుమతులను అందించడం జరిగినది, అనంతరం జరిగిన మహిళా సదస్సులో మండల అధ్యక్ష కార్యదర్శులు మల్లం సుబ్బమ్మ, ముర్రం రంగమ్మ మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నాయి అనాదిగా మహిళలపై దాడులు అఘాయిత్యాలు అత్యాచారాలు మాత్రం ఆగడం లేదని 90 ఏళ్ల ముసలి నుండి ఆరు నెలల పసికందు వరకు నిత్యం ఏదో ఒక ప్రదేశంలో అగత్యానికి గురవుతూనే ఉన్నారని, ఘటన జరిగిన సందర్భంలో మాత్రమే అధికారంలో ఉన్నటువంటి ప్రజా ప్రతినిధులు, అధికారులు, నిందితులను కఠినంగా శిక్షిస్తాం నేరాలను తగ్గిస్తాం అని రక్షణకు చట్టాలను రూపొందిస్తున్నాం అని ప్రచారానికి మాత్రమే పరిమితం అవుతున్నాయని మహిళలపై జరిగే దారుణాల కారణమైన మద్యం, డ్రగ్స్, అశ్లీలతను నియంత్రించాల్సినటువంటి ప్రభుత్వం యంత్రాంగం నామ్కే వాస్తుగా మాత్రమే ఉందని చర్యలు మాత్రం శూన్యంగా ఉన్నాయని అందుకే ఈ ఘటనలు అధికం అవుతున్నాయని అన్నారు, ఎన్నికల సందర్భంగా మాత్రమే మద్యాన్ని దశలవారీగా నియంత్రిస్తాం అని ప్రకటన చేస్తున్నారు కానీ పట్టణాల నుండి గ్రామాలు మారుమూల ప్రాంతాల వరకు విచ్చలవిడిగా ఏరులై పారుతుందని నియంత్రణ లో యంత్రాంగం విఫలం అయిందని మహిళలపై దారుణాలు నియంత్రణ కోసం దిశ, నిర్భయ, పోక్స్, చట్టాలు ఉన్న అంతంత మాత్రంగానే ఉన్నాయని ఈ చట్టాలు పటిష్టంగా అమలు చేసి నియంత్రించడం మహిళలకు ఉన్నటువంటి హక్కులను రాజకీయ హక్కులను 33% రిజర్వేషన్ను పటిష్టంగా అమలు చేస్తే మహిళకు న్యాయం జరుగుతుందని, రానున్న రోజుల్లో మహిళలపై జరిగే దార్నాలపై మహిళలు ఐక్యంగా ముందుకు రావాలని ఈ సందర్భంగా అన్నారు, ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి గారు కుటుంబంలోని 18 ఏళ్ల నిండిన ప్రతి మహిళకు ప్రతి నెల 1500 రూపాయలు అందిస్తానని ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని పొదుపు మహిళలను లక్షఅధికారులుగా తీర్చిదిద్దే కార్యక్రమం రూపొందిస్తామని ప్రకటనలకు మాత్రమే పరిమితం అయిందని ఎన్నికల హామీని ప్రభుత్వం అమలులో జాప్యం తగదని ఉచిత గ్యాస్ పథకం కూడా కొంతమందికి మాత్రమే వర్తించిందని ప్రతి మహిళకు ఉచితంగా గ్యాస్ బండ పంపిణీ చెయ్యాలని డిపాజిట్ చేశాక అనేక కారణాలతో డబ్బులు తిరిగి రాక చాలామంది మహిళలు నష్టపోయారని ఈ సందర్భంగా అన్నారు ఈ కార్యక్రమంలో తాటికొండ జయలక్ష్మి, యు నాగమణి, మాధవి, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.